శాంతి అంతరించె సత్యంబు కరువయ్యె
ఆయుధముల ప్రీతి అధికమయ్యె
ఈ దురంతములకు హేతువు స్వార్థమె
ఉన్న మాట తెలుపుచున్న మాట

సత్యం, జ్ఞానమనంతం, బ్రహ్మ, అక్షరం, పరమాత్మ, పరతత్త్వం, బ్రహ్మ, క్షేత్రజ్ఞ, ఇత్యాది పదములన్నియు ఆత్మ యొక్క పర్యాయ పదములే. దేశకాల వస్తు పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకొని ఈ విధమైన నామములు యేర్పడుతూ వచ్చినవి. ప్రపంచమున ప్రతి ప్రాణి కూడను సుఖమునే ఆశిస్తుంది. దుఃఖమును దూరము నెట్టుతుంది. కానీ మానవుడు సుఖమును శాంతిని ఆనందమును ఆశించుచున్నప్పటికిని దుఃఖము, బాధలు, అశాంతి వెంటాడటములో అంతరార్థము ఏమిటి? దుఃఖము అశాంతి, భయము ఇవన్నీ సుఖ శాంతి ఆనందముల యొక్క ప్రతిబింబములే. దుఃఖము లేకుండిన సుఖమునకు విలువలేదు. అశాంతియె లేకుండిన శాంతిని మనము ఆశించము. కనుక ఒకదానినొకటి అనుసరిస్తూ సమన్వయము చేసుకుంటూ సన్నిహిత సంబంధ బాంధవ్యము తోనే కూడి మెలుగుతూ వస్తుంటాయి

భూలోకము, భువర్లోకము, సువర్లోకము ఈ మూడు లోకములు ఓంకారము నందలి అకార ఉకార మకారముల యొక్క ప్రతిబింబములే యని నిన్నటి దినము గుర్తించుకున్నాం. ఋగ్వేద యజుర్వేద సామవేదములు మూడు కూడను అకార ఉకార మకారములందు తాము భిన్నమైన స్వరముల చేత పల్లవిని వాయిస్తూ వున్నాయి. అదికాకుండా త్రికాలముల యొక్క ఏకత్వమైన ప్రణవ తత్వాన్ని మనము పొందవలెనన్న దానికి మూడు మార్గములుంటున్నవి. మొదటిది నామ చింతన. రెండవది భావము. మూడవది సాధన. నామ చింతన చేత కేవలము భౌతికమైన భూలోకము యొక్క భోగభాగ్యములను అనుభవించవచ్చును. ఇవి అనిత్యమైనవి అసత్యమైనవి. క్షణికమైనవి. ఇట్టి అనిత్యము క్షణికమైన భోగభాగ్యములు కేవలము నామచింతన చేతనే లభ్యమవుతున్నది భూలోకము నందు. భావము చేత. భావము అనగా ఈ జగత్తునకు ఈ చరాచర ప్రపంచమునకు ఒక సృష్టికర్త అనే దివ్యమైన శక్తి వున్నదని అనే భావమును పురస్కరించుకొని ఆ భావమును

తన జీవితాధారంగా భావించుకొని దానిని చింతించటం చేత చంద్రలోకమును చేరుతాడు. ఈ స్థూలమునకు మూలమనే దివ్యత్వము వున్నది అనేది ఒక పెద్ద భావము చంద్రలోకమనగా మానసిక సామ్రాజ్యమందలి శాంతి సుఖములను అనుభవిస్తాడు ఈ యొక్క భావము చేత. నామస్మరణ చేత భూలోకము యొక్క శాంతిని, భావచింతన చేత మానసిక సామ్రాజ్యమునందు అనుభవించే ప్రశాంతిని అనుభవిస్తూ క్రమక్రమేణా సాధనలో ప్రవేశిస్తాడు. ఈ సాధనా ప్రభావము చేత సువర్లోకమును పొందుతాడు. సువర్లోకమనగా సూర్యలోకము. సూర్యలోకమనగా ప్రజ్ఞాన విజ్ఞానములో కూడినదివ్యమైన ఆత్మ తత్వమే. దివ్యదృష్టి మిళితమైన జ్ఞానమే. ఏకత్వమైన జ్ఞానమునందు పరమశాంతిని అనుభవిస్తాడు. భూలోక భువర్లోకములు అపర బ్రహ్మకు సంబంధించినవనియు, సువర్లోకమనేది పరబ్రహ్మకు సంబంధించినది. కనుక భూలోక భువర్లోకములు రెండూ కూడను భౌతికమైన, లౌకికమైన, క్షణికమైన ఈ దృశ్యకల్పితమైన జగత్తుకు మాత్రమే సంబంధించినది. భూలోకము స్థూలము. భువర్లోకము సూక్ష్మము. స్థూలము శరీరము. సూక్ష్మము మనస్సు. శరీర మనస్సుల సంబంధమైనవే భూలోక భువర్లోకములు. కాని సువర్లోకము కేవలము ఆత్మస్థాయికి సంబంధించినది. ఈ నామస్మరణ, భావము, సాధన వల్ల ఈ మూడు లోకములు ప్రాప్తిస్తూ వున్నాయి. ఈ తీ మూడింటి సాధనలు మానవుడు సల్పినప్పుడు భూలోక సువర్లోకములకు అతీతమైన పరమశాంతిని పొందుతాడు. ఇలాంటి పవిత్రమైన స్థితిని పొందటువంటిదే మానవుని ప్రధానలక్ష్యము

ఈ విధమైన సమాధానము పిప్పలాది మహర్షి శిష్యులకి చెబుతున్న సమయములో సత్యకాముడు లేచి 'స్వామి! షోడశ కళాపరిపూర్ణుడైన పురుషోత్తముడు ఒకడు వున్నాడని సమస్త శాస్త్రములు ప్రబోధిస్తున్నాయి. ఈ షోడశ కళాపరిపూర్ణుడైన పురుషోత్తముడు ఎవరు? ఈ షోడశ కళలు అనగా ఏమి? ఇవి ఎక్కడ వుండును? వీటికి సమాధానములు చెప్పి మా మనస్సుకు శాంతిని చేకూర్చమని ప్రార్థించాడు. పిప్పలాదుడు చిరునవ్వు నవ్వుతూ, 'నాయనా! సత్యకామా! ఈ షోడశ కళా పరిపూర్ణుడైన పురుషోత్తముడు ఎక్కడనో లేడు. ప్రతి మానవుని యందు చైతన్యరూపములో ఆనందమును అనుభవిస్తూనే వున్నాడు. అతనే సత్. అతనే చిత్ అతనే ఆనందము. అనగా being, awareness, and bliss. Being అనగా ఎప్పటికిని మార్పుచెందక మార్పుచేయక తాను సత్యనిత్యుడై వుంటాడు. పరిపూర్ణత్వమును గుర్తించేవాడు చిత్. ఈ రెండింటి చేతను అనుభవించేవాడు ఆనందస్వరూపుడు. ఈ రెండింటి యొక్క ఏకత్వము ఆనందము. రూపనామము

లు భిన్నముగా వుండినప్పటికిని యీ రెండింటి యొక్క దృష్టి ఏకత్వముగానే వుంటుంది. ఒకటి right eye. రెండవది left eye. ఈ రెండూ భిన్నముగానే వుంటున్నాయి. కాని దృశ్యములో యిది right, left లేదు, రెండూ ఒక్కటిగానే చూస్తున్నాయి. కనుక సత్ చిత్ యీ రెండింటి యొక్క సమ్మిళితమైన స్వరూపమే ఆనందము. అట్టి సత్, అట్టి చిత్, అట్టి ఆనందము ప్రతి మానవుని యందు వుంటున్నది. ఇతడే అటనే షోడశ కళలు కల్గి వుంటున్నాడు. ఈ షోడశ కళలు అనగా శాస్త్రములు వేదములు, ఇతిహాసములు, పురాణములు అనేక విధములుగా బోధించి భిన్న భిన్న అర్థములను కల్పించి మానవుని యందు ఒక విధమైన అనర్థ మార్గమును ప్రవేశ పెడుతూ వచ్చాయి. ఈ పదహారు కళలు మనము ఎక్కడో సంపాదించేవి కావు. ఆకాశము శబ్దముతో కూడినది. ఆ శబ్దము ద్వారా వాయువు సంభవిస్తున్నది. ఈ వాయువు ద్వారా అగ్ని, తేజస్సు ఆవిర్భవిస్తున్నాయి. ఆ తేజస్సు ద్వారా నీరు సంప్రాప్త మవుతున్నది. వీటి యొక్క ఘన భావమే పృథ్విగా రూపొందుతున్నది. ఇవి పంచ భూతములు. ప్రాణ, అపాన, సమాన, వ్యాన, ఉదాన యివి పంచ ప్రాణములు. యివి రెండూ చేరి పది అయినాయి. కన్నులు, ముక్కు, చెవులు, నోరు, చర్మము యివి ఐదు శబ్ద స్పర్శ రూప రస గంధములు యివి పంచ జ్ఞానేంద్రియములు. ఇవి చేరి పదహైదు అవుతాయి. మనస్సు. ఈ పదహారు కళలతో కూడినది. ఇది ప్రతి మానవుని యందు నిండి వుంటున్నవి. కళకళలాడుతున్నవి. కిలకిల నవ్వుతున్నవి. ఇట్టి కళలను పరిపూర్ణమైన స్థితిలో అనుభవించాలి. ఈ పరిపూర్ణమైన షోడశకళలను పరిపూర్ణముగా అనుభవించి, పరిపూర్ణ మార్గములో ప్రవేశ పెట్టి, పరిపూర్ణత్వమును పొందినవారే పురుషుడని పురుషోత్తముడని పేరు పొందుతూ వచ్చారు. పురుషుడనగా ఎవరు? Pant బుష్ కోటు వేసుకున్న వాడు కాదు పురుషుడు ఈ దేహమనే పురమునందు నఖశిఖ పర్యంతము సంచరించే చైతన్య శక్తికే పురుషుడని పేరు. ఈ నఖశిఖ పర్యంతము సంచరించే చైతన్యశక్తికి పురుషుడని యీ వ్యక్తిని ఆధారము చేసుకొని వ్యక్తిత్వాన్ని అనుభవించే వాడు పురుషుడని సమిష్టి స్వరూపము లోపల సమత్వంగా ప్రకటించి, ప్రకాశించి, వికసించి, లోన జగత్తుకు ప్రకటించే దివ్యశక్తికి పురుషోత్తముడని పేరు పెట్టారు. అనగా వ్యష్టి స్వరూపుడు పురుషుడు. సమిష్టి స్వరూపుడు పురుషోత్తముడు. ఈ పురుషుడు సార్థకము గావించుకునే నిమిత్తము యీ కర్మలు ఆచరించాలి. శబ్దము, వాయువు తేజస్సు, జలము, భూమి యీ పంచ భూతములు పరమాత్మ పదార్థములుగా విశ్వసించి వాటిని సార్థకము గావించుకునే రీతిలోపల మనము భావము పెట్టుకొను

కోవాలి. జ్ఞానేంద్రియములు ఐదు అందించాడు. చూడటం. ఇందే తేజస్సు. ఈ తేజస్సును సద్వినియోగం చేసుకోవాలి. దుర్వినియోగము గావించరాదు. మంచిని చూడాలి. అప్పుడే యీ తేజస్సు దివ్యమైన కళగా వుంటుంది, యీ కళను సార్ధకము గావించుకుంటుంది. రెండవది శ్రవణము. ఈ శ్రోత్రము ద్వారా మనము పవిత్రమైన పరతత్వాన్ని అభివృద్ధి పరచుకునే విషయాలను మాత్రమే మనము వినాలి. ఈ శ్రోత్రేమయే దివ్యశబ్దము మనము వ్యర్థము చేయకూడదు. ఇంక మూడవది. సుగంధమును అందుకోవాలి. ఆరోగ్యమే కాక ఆనందము ఆహ్లాదము నందిస్తుంది. దుర్గంధమును అనారోగ్యమునే కాక అశాంతిని కూడా కలిగిస్తుంది. కనుక యీ సుగంధమే భగవంతుని గాలిస్వరూపము. ఇంక చర్మము. అందరిని ముట్టకూడదు. ఈ స్పర్శ అనేది చాలా పవిత్రమైనది. ఈ పవిత్రము గావించుకునే నిమిత్తమై ఆనాటి మహర్షులు గ్రామములు, పల్లెలు యివన్నీ వదిలి ఏకాంతముగా అరణ్యములో చేరి ఏకాకియై ధ్యానములు సల్పుతూ వచ్చారు. శరీరమందు ఒక దివ్యమైన శక్తి ఒకటి వున్నది. అదే చిత్ శక్తి అని. ఆ చిత్ శక్తి అనేది ఒక కరెంటు వంటిది. ఈ కరెంటు మరొక దానిని తాకినప్పుడు ఆ కరెంటు దానిలో యీ కరెంటు దానిలో ప్రవేశిస్తుంది. తద్వారా మనయందున్న సద్గుణములు రూపుమాయవచ్చు, దుర్గుణములు ప్రవేశించవచ్చు. కనుకనే పవిత్రమైన పురుషులను మాత్రమే, పవిత్రమైన వ్యక్తులను మాత్రమే నమస్కరించి వారి పాదముల నంటి, లేక యింకే విధమైన రీతిగా స్పర్శను కల్పించి, తద్వారా మనయందున్న దుర్భావములను దూరము గావించుకునే నిమిత్తమై ఏర్పరచారు. ధ్యానమునకు కూర్చునేవారు ఒకరికొకరు కలసి కూర్చోకూడదు. ఒకరి దేహము ఒకరికి యే మాత్రము touch కాకూడదు. ప్రత్యేకంగా కూర్చుని తన లోపలనున్న శక్తిని బయటకి ఆవిర్భవింప జేసుకొని అంతర్గతమైన దివ్యశక్తిని మానసికంగా ఆనందముతో అనుభవించాలి. 'అంతర్బహిశ్చ తత్ సర్వం వ్యాప్య నారాయణ స్థితః' ఇదియే నిజమైన తత్వము. కనుక మన స్పర్శ కూడను యెదో లోచినట్లుగా ఎవరంటే వారితో మనము సహవాసము చేసి అనేక రకములుగా యీ చర్యలను మనము అనుభవించుచూ పోవటం చేతనే మనయొక్క దివ్యత్వము క్షీణిస్తూ పోతున్నది. కనుక ఆనాటి దివ్యపురుషులు తమయందున్న పంచభూతములను పవిత్ర మార్గంలో ప్రవేశపెట్టటం చేత వారు దివ్యపురుషులుగా రూపొందుతూ వచ్చారు.

ఇంక పంచ ప్రాణములు. నిన్నటి దినము చెప్పాను. మన దేహములో 72 కోట్ల నాడులు వుంటున్నవి. నాడులందు వ్యాన అనే శక్తి సమంగా ప్రసరిస్తూ వుంటున్నది. ఈ వ్యాన అనే దివ్యమైన ప్రాణశక్తి యీ 72 కోట్ల నాడులందు సమంగా ప్రసరిం

429059105

చటంచేతనే యిది ఆరోగ్యము నందిస్తున్నది. ఆనందమును చేకూరుస్తుంది. ఈ జ్ఞాన అనే శక్తి మన శిరస్సునందు సహస్రార పద్మముగా వుంటున్నాయి మన తెలివితేటలు. మూలాధారమునుండి సహస్రారము వరకు కుండలిని శక్తి ప్రయాణము సల్పినప్పుడు యీ సహస్రార పద్మములన్నీ వికసిస్తాయి. ఈ మూలాధార చక్రమునుంచి సహస్రార పద్మము వరకు వెళ్ళిన కుండలినీ శక్తి దేదీప్యమానముగా ఆ సహస్రార పద్మములో ప్రవేశిస్తూ వుంటుంది. ఆ విధమైన శక్తిని కోల్పోటం చేత మానవుడు సమస్త దుఃఖములకు గురై పోతున్నాడు. మహర్షులు అట్లా కాదు. ఈ మూలాధార చక్రమును పవిత్రము గావించుకొని యీ కుండలినీ శక్తిని సహస్రార పద్మము వరకు సరియైన మార్గములో ప్రసరింప జేసి సార్థకత చేకూర్చుకుంటూ వచ్చారు. కనుక యీ పంచ ప్రాణములను సరియైన మార్గములో వినియోగించుకోవాలి. ఈ విధముగా 16 కళలు కూడను మానవుని యందే వుండి కూడను దానిని సద్వినియోగ పరచుకోలేక పోతున్నాడు. తన యొక్క దివ్యమైన భావమును తాను గుర్తించుకోలేక పోతున్నాడు.

అడిగిన పాలిచ్చు కామధేనువు వుండ
ధనవిచ్చి ఆవును కొనగనేల
కోరిన ఫలమిచ్చు కల్పవృక్షంబుండ
పెరటి వృక్షములకై ప్రీతి ఏల
మిండెడు కాంతిలో మేరు పర్వతముండ
వెండి బంగారుకై వెతకనేల

ఏయింటే షోడశకళాపరిపూర్ణుడైన పరమాత్ముడు వుండి కూడను షోడశకళలు వుండి కూడను వాటి దివ్యమైన భావాన్ని గుర్తించుకోలేక పోవటంచేత మన చదువులన్నీ అపవిత్రమై అశాంతికి గురౌతున్నాము. పురుషునిగను, పురుషోత్తమునిగను మార్చలేకపోయిన ఫరవాలేదు గాని పశువుగా మారుస్తున్నవి యీ షోడశ కళలు. ఉన్నత స్థాయికి పోవలసిన మానవుడు అధోస్థాయికి దిగజారి పోతున్నాడు.. వీటన్నింటికి కారణము ఏమిటి? మనలో వున్న యీ పదహారు కళలు సరియైన మార్గములో అనుభవించటం లేదు.

పోనీ మనకు వేదశాస్త్ర యితిహాస పురాణములు తెలియక పోయినప్పటికిని మన యొక్క నిత్య జీవితములో నీతి నిజాయితీ తత్త్వమైనా కొంత వరకు మనం అనుభవించటానికి ప్రయత్నించటం లేదు. నోటిలో సత్యము పలకాలి. మధురమైన వాక్యములు వుచ్చరించాలి. పరుల నొవ్వందపెట్టే పదములు వాడాలి. పరులను బాధించకూడదు. పరులను నొప్పించరాదు. కఠినపద

యములతో ఎవరిని బాధపెట్టరాదు. అని తెలిసి కూడను వాటిని సరియైన మార్గములో ప్రవేశపెట్టలేక పోతున్నాము. కారణము ఏమిటి? స్వార్థము. స్వార్థము. తన స్వార్థము ఫలింప చేసుకునే నిమిత్తమై, యీవిధమైనది తప్పు అని తెలిసి కూడను దానిలో ప్రవేశించి తాను యీ కళలను అపవిత్రము గావించుకుంటూ వున్నాడు. కనుక పరిపూర్ణ కళలలో కూడినవాడు మానవుడే. దీనిని పవిత్రము గావించుకున్నవాడు పురుషోత్తముడౌతాడు. దీనిని అపవిత్రము గావించుకున్నవాడు మానవాధముడౌతాడు. కనుక యీ సత్యకాముడు అడిగిన దాంట్లో పురుషోత్తముడనేవాడు ప్రత్యేకమైన ప్రదేశములో లేడు

దేవుడనగ వేరు దేశమందున లేడు
దేవుడుండు తనదు దేహమందె
పాపమనగ వేరు పరదేశమున లేదు
తాను చేయు పనుల తగిలియుండు.

మన కర్మల ద్వారానే మనము పురుషులము, పురుషోత్తములము, మానవులము, మానవాధములము అవుతున్నాము. ఉన్నత స్థాయికి గొనిపోవునవి మన చర్యలే. అధఃస్థాయికి నెట్టునవి మన చర్యలే. కనుక షోడశ కళలతో కూడినవాడు పరమాత్ముడు అతను పురుషోత్తముడని పురాణములు చెప్తూ వచ్చాయి. అవతార పురుషులు మాత్రమే యీ కళలు స్వార్థరహితమైన మార్గములో ప్రవేశపెడుతూ వచ్చారు కనుకనే అతనే పురుషోత్తముడని నామమును సార్థకము చేసుకున్నారు. ఏమి చేసినా ఏది చూచినా, ఏమి చెప్పినా ఏమి తలచినా అన్నీ స్వార్థరహితమైనవే. ఏ అవతారమునందు కూడను భారత దేశమునందే గాక యితర దేశములందైనప్పటికి నిస్వార్థమై తమ పంచ ప్రాణములు గాని, పంచేంద్రియములు గాని, పంచ భూతములు గాని, మనసు గాని అపవిత్రము గావించుకోలేదు. నిత్యజీవితములో సామాన్య మానవులుగా సంచరించుచూ వచ్చినప్పటికి తన ప్రతి కర్మయందు పరిశుద్ధమై పవిత్రమై నిత్యమై సత్యమై రాణిస్తూ ప్రకాశిస్తూ వుంటుంది. ఈ సత్యాన్ని మానవుడు గుర్తించలేక పోతున్నాడు. ఈ గుర్తించుకోలేక పోవటము చేతనే మానవత్వమును అర్థము చేసుకోలేక పోతున్నారు. ఈ విధమైన ప్రబోధ సత్యకామునికి పిప్పలాద మహర్షి చెప్పుచూ నాయనా రెండింటి ఏకత్వమును గుర్తించటం కొంత వరకు అత్యవసరమన్నాడు.

స్థూలమైనది కేవలము క్షరము, సూక్ష్మమైనది అక్షరము. కేవలము భౌతికమైనది క్షరము. ఆత్మకు సంబంధించినది అక్షరము. జీవితమునకు

429059107

సంబంధించినది క్షరము. దేవునికి సంబంధించినది అక్షరము. కనుక యీరెండింటి యొక్క ఏకత్వాన్ని గుర్తించటము పరమ పవిత్రము అన్నాడు. ఈరెండింటి ఏకత్వము గుర్తించుకున్నప్పుడే యీషోడశ కళలకు పరిపూర్ణత నీవు చక్కగా వినియోగించుకోగలవు. సమస్త చరాచర ప్రపంచమంతయు అక్షరమునుండియే ఆవిర్భవిస్తూ వచ్చింది. అక్షర స్వరూపం నుండి వచ్చినది. అక్షర లోకంగా మారుస్తూ వచ్చింది. ఈ ప్రపంచాన్ని ప్రసవించి దానిని పోషించి, దానిని రక్షించి తదుపరి తనలోనే లయము గావించుకోటం యీ అక్షరమే. ఈ జీవ బ్రహ్మల ఏకత్వమే అక్షరము. అనగా అనిత్యమైనది నిత్యమైనది రెండింటి ఏకత్వమే అక్షరము. ఈ పరిపూర్ణమైన షోడశ కళలు క్రమ క్రమేణా పవిత్రము గావించుకొని వీటినన్నీ ఆత్మ భావములో చేర్చినప్పుడు పవిత్రమవుతాయి. నీ దృష్టి నేత్రము వరకే పోవద్దు ఆత్మ వరకు ప్రయాణము చెయ్యి. ఆత్మ ప్రకాశము చేతనే నేను కన్నులతో చూడగలుగుతున్నాను అనే భావము అభివృద్ధి పరచుకో. కేవలము చెవులు వింటున్నాయని కర్ణేంద్రియములు మాత్రమే ఆధారము చేసుకోవద్దు. ఈ ఆత్మ స్వరూపమైన ప్రజ్ఞ ద్వారానే చెవులు వినగలుగుతున్నాయి. కనుక అన్నింటికిని ప్రజ్ఞ అనేది ఒకటి వుంటున్నది కారణరూపమై. బాహ్యదృష్టి అయితే విశ్వుడు. అంతర్ దృష్టియైన మానసిక తత్వము నిద్రావస్థ లేక స్వప్నావస్థ యిదంతా ప్రాజ్ఞుడు. ఈ ప్రజ్ఞా తత్వములో తేజస్సు కూడను ఆవిర్భవిస్తూ వుంటుంది. కనుక మనము చేసేటువంటివి చూసేటువంటివి అన్నియు మనము ఆత్మ భావములో ఏకం చెయ్యాలి. ఆవిధంగా చేసినప్పుడే యివన్నీ పరిపూర్ణమైన కళలుగా రూపొందుతాయి: ఎట్లా? అనేక నదులు అనేక రూపములతో ప్రవహిస్తున్నాయి. వాటి రూపములు వేరు నామములు వేరు. కాని సముద్రములో చేరిన తరువాత దాని రూప నామములు పూర్తి కోల్పోతాయి. సముద్రము యొక్క రూప నామ రుచులనే పొందుతాయి. అదేవిధముగనే యీ పంచభూతములనేవి కొన్ని ప్రవాహములు. ఈ పంచ ప్రాణములు ఒక ప్రవాహము. ఈ పంచేంద్రియములు ఒక ప్రవాహము. మనస్సు మరింత భయంకరమైన గంగా ప్రవాహము. ఇవన్నీ ప్రవహించి క్రమక్రమేణా ఆత్మ అనే ప్రజ్ఞ లోపల యివి ప్రవేశించినప్పుడు అన్ని కళలు కూడను ఆత్మ కళలుగా రూపొందుతాయి. తమయొక్క రూప నామ రుచులన్నీ కోల్పోతాయి. ఆత్మయొక్క పవిత్రమైన ప్రజ్ఞా తత్వమును పొందుతాయి. ఈ ఆత్మలో చేరటంవలన నిత్యమై సత్యమై నిరంజనమై నిరుపమై నిష్కళంకమై వుంటుంది. కనుకనే 16 కళలయందు మానవత్వాన్ని సార్థకం గావించుకోవాలి: అప్పుడే మనము పురుషులము, పురుషోత్తములము కాగలము.

ఈ పురుషోత్తముడు కావాలనుకున్నప్పుడు మనము సత్కర్మలలో, సద్భావములలో, సచ్చింతనలలో ప్రవేశించాలి. ఒక్కదానిని మనం గుర్తించుకున్నామా సర్వము గుర్తించుకున్నవారమవుతాము. ఇదియే శౌనక మహర్షి, అంగీరసుని దగ్గరకు వెళ్ళి స్వామి! దేనిని తెలుసుకుంటే అన్నీ తెలుసుకున్నవారమౌతామో, దేనిని దర్శిస్తే అన్నియు దర్శించినవారమౌతామో, దేనిని అనుభవిస్తే అన్నియూ అనుభవించినవారమౌతామో అది దివ్యమైన, భవ్యమైన తత్వము ఏమిటి? అన్నాడు. అప్పుడు అంగీరసుడు చెప్పాడు. 'నాయనా! దీనికి బ్రహ్మవిద్య ఒకటి తప్ప అన్యవిద్యలు లేవన్నాడు. ఈనాటి విద్యలనియూ లౌకిక విద్యలు. ఈనాడు చిత్రకళ, సంగీతకళ, సాహిత్యకళ, శిల్పకళ యింకా బోటనీ, జువాలజీ, ఫిజిక్సు, కెమిస్ట్రీ యివన్నీ లౌకికమైన కళలు. ఈ విద్యలన్నియు కేవలము విజ్ఞానము కొరకని మనము భావిస్తున్నాము. కాదు. కాదు నేడు పరిస్థితి పూర్తిగా విచారిస్తే యీ విద్యలన్నియు కూటివిద్యలు, పొట్టవిద్యలుగా రూపొందుతున్నాయి. విద్య విజ్ఞానము కొరకే అనే సత్యాన్ని మనం గుర్తించాలి. అప్పుడే యీ బ్రహ్మవిద్య మనము పొందినవారమవుతాము. ఈ బ్రహ్మవిద్య అనగా ఏమిటి? లౌకిక విద్య కేవలం కంటికి కనుపించేది, చెవులకు వినుపించేది, మనసుకు ఊహించేది, యింద్రియములను కలిపించేటువంటిది. కాని బ్రహ్మవిద్య అనేది కంటికి కనుపించదు, చెవులకు వినిపించదు మనస్సుకు అనిపించదు; హృదయాన్ని మురిపించదు; ఆత్మను తపిస్తూ వుంటుంది. ఇట్టి ఆత్మవిద్యను మాత్రమే నీవు గుర్తించాలి. ఇట్టి ఆత్మవిద్య ఎప్పుడు మనకు చేకూరుతుంది. షోడశకళాపరిపూర్ణ స్థితి యుండే యిది మనకు ప్రాప్తిస్తుంది.

అందువలననే సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అన్నారు. సత్యం సత్యమనగా మార్పుచెందనిది. త్రికాలబాధ్యమైనది సత్యం. జ్ఞానం. అద్వైత దర్శనం జ్ఞానం. రెండు కానటువంటి తత్వమును గుర్తింపచేసేది జ్ఞానం. అనంతం. ఇక్కడ వున్నది అక్కడ లేదు అనేటువంటి మార్పు లేకుండా ఎక్కడ చూచినా సర్వత్ర నిండినది. బ్రహ్మ అనగా వ్యాపింపచేసేది. ఇదియే అంగీరసుడు శౌనకమహర్షికి బోధిస్తూ వచ్చాడు. ఎవరు యీ అంగీరసుడు. వీరందరు ఎవరో ఋషులని భావించుకుంటూ పురాణముల ద్వారా యితిహాసముల ద్వారా మనము కథలుగా చదువుకుంటూ వస్తున్నాం. మానవుని వ్యధలు దూరముగావించే సద్భావముల యొక్క రస స్వరూపములు. ఇదియే అంగీరస. అంగీరసుడనగా ఏమిటి? ప్రతి అంగమునందు షోడశకళాపరిపూర్ణుడై ప్రసరించటంచేత ప్రతి అంగము కూడను కాపాడుకుంటూ వస్తున్నాడు. కనుకనే భగవంతుడు రసస్వరూపుడు. రసము ఏరలగా ప్రవహిస్తున్నది. షోడశకళలను కరగించి ఆత్మవైపున ప్రవహింపజేసి దివ్యమైన జగత్తును అనుభవిస్తున్నది. కనుక అంగీరసుడనగా మనలో వున్న ప్రజ్ఞాన స్వరూపుడే. ఈ ప్రజ్ఞానము దేహమునందు, మనస్సునందు, అంతఃకరణము యందు, యింద్రియములందు, ప్రాణములందు, కణములయందు అన్నిటియందులోనై

వుంటున్నది. కనుకనే ప్రజ్ఞానం బ్రహ్మ అని వేదము లోపల ప్రధానమైన సారంగా భావిస్తూ వచ్చారు
నాలుగు వేదములందు ప్రధానమైన సూత్రములు నాలుగు. అవే తత్వమ
సి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మ బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి. ఈ విధమైన సూత్రములన్నియు
అనంతమైన అర్థములతో కూడి మానవుని యందే అంతర్భూతమై ప్రవహిస్తున్నాయి. మానవు
డు దీనిని తెలుసుకోవలెనన్నను బయటకు పోయి తెలుసుకోనక్కరలేదు. గ్రంథముల ద్వారా
తెలుసుకోనక్కరలేదు. అన్ని తనయందే వుంటున్నవి. తనయందే వున్న సర్వస్వమును లోను
విస్మరించి ఏదో బయట వున్న దానిని సర్వస్వము అర్పింప చేసుకొని కడకు నిరాశ నిస్పృహ
లకు గురైపోతున్నాడు. తాను పోగొట్టుకున్నది ఒక చోటు వెతకటం మరొక చోటు. ఎట్లా
చిక్కుతుంది ఆ పదార్థము. కనుక నిరాశకు గురైపోతున్నాడు. ఎక్కడ పోగొట్టుకున్నాడో అక్కడకు
పోయి వెతకాలి. అన్ని తనయందే వుంటున్నవి. కనుక తనయందే వెతకాలి లోను. అప్పుడే
ఈ దివ్యమైన, ప్రకాశవంతమైన ప్రజ్ఞ తనకు లభిస్తుంది. ఈ అక్షరము అనే పదమునందే
సర్వము ఇమిడి వుంటున్నది. అనగా అనిత్యమైన, నిత్యమైన రెండింటి యొక్క ఏకత్వమే
ఈ అక్షర. ఇక్కడ రెండు భాగములుగా మనము విభజించుకుందాము. అ క్షర. అ-అనంత
మైనది. అప్రమేయమైనది. అప్రమాణమైనది. అదే ఆనందమయమైనది. అదే ఆత్మ. అదే
నిత్యమైనది. ఇంక క్షర అని. అనిత్యమైనది. అసత్యమైనది. ప్రమాణము లేనిది. క్షరమనగా
నశించేది. అకారమనగా ఎప్పుడూ నశించనిది. ఈ రెండింటి చేరికే అక్షరం. నశించనిది
నశించునది రెండింటి ఏకత్వమే అక్షరం. కాని మనం కేవలం ఒక్క పదమనే అనుకుం
టున్నాం. కాదు కాదు. ఇది రెండు పదములుగా మనం విభజించుకోవాలి. అనిత్యమైన జగత్తు
నిత్యమైన పరమాత్మ లోనే వుంటున్నది. పరమాత్మను వదలి జగత్తు వుండలేదు. జగత్తు
వదలి పరమాత్మ వుండలేదు. భక్తుడు భగవంతుని సృష్టిస్తున్నాడు. భగవంతుడు భక్తుని
సృష్టిస్తున్నాడు ప్రజలనంతా, జీవులనంతా భగవంతుడే సృష్టిస్తున్నాడని అనుకుంటారు
కాదు కాదు. భక్తుడు కూడను తన సాధనా సంపత్తి వల్ల భగవంతుని సృష్టించుకుంటున్నాడు
అదే సాక్షాత్కారమని. ఈ సాక్షాత్కారము ఎక్కడనుండి వస్తున్నది. భక్తుని యొక్క భావోద్రే
కముల చేతనే దీని అర్థం చేసుకుంటున్నాడు. సాక్షాత్ ఆకారము సాక్షాత్కారము. కనుకనే
భగవంతునికి సృష్టికర్త భక్తుడే. భక్తునికి సృష్టికర్త భగవంతుడే. కనుక ఈనాడు
భక్తుడు ఆ సత్యాన్ని గుర్తించుకోలేక పోవటం చేత భగవంతుడు ఎక్కడెక్కడ అని
వెతకటానికి ప్రయత్నిస్తున్నాడు. ఎంత అజ్ఞానము. సర్వత్రా నిండిన భగవంతుని వెతికేది
ఎక్కడ. కనుక నేను భగవంతుని వెతుకుతున్నాననుకోటం భ్రాంతి. భగవంతుడే నిజమై
న భక్తుని వెతుకుతున్నాడు. ఎందుకంటే నిజమైన భక్తుడు ఎక్కడ వుంటున్నాడో కనుపిం
చటం లేదు. ఈ విచారణ శక్తి యిది చేస్తూ వచ్చింది. అదియే త్యాగరాజు చక్కగా గుర్తించాడు

429059110

చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో ప్రేమ మీర
వెలసి యుండే బిరుదు వహించిన రామా నన్ను బ్రోవరా

అన్నాడు. అనగా చీమలో వున్నాడు. బ్రహ్మలో వున్నాడు. ఈ చీమ చేసే పని ఏమిటి? ఇంత యిసుకను తెచ్చి రెండు ముక్కలు చక్కెర దాంట్లో కలిపి యిస్తే యిసుకను దూరము చేసి ఆ చక్కెరను మాత్రమే స్వీకరిస్తుంది చీమ. ఈ విధమైన విచారణాశక్తి చీమయందే వుంటుండగా మానవుని యందు ఎందుకు క్షీణించి పోయింది.

అణోరణీయాన్ మహతో మహీయాన్ ఈ రెండింటి తత్వాన్ని మనము అర్థం చేసుకోవాలి. అక్షర స్వరూపమనగా కేవలము నాశనము కానిదని అనుకుంటాము. అందులోనే నాశనము వుంటున్నది. అనగా క్షరమైనది కూడను చేరటం చేతనే అక్షరమనేది రూపొందుతూ వుంటున్నది. అదే విధముగనే ఆస్తికత్వానికి నాస్తికత్వానికి సంబంధము వుంటున్నది. ఆస్తికత్వము లోనే నాస్తికత్వము కూడా వుంటున్నది. నాస్తికత్వములోనూ ఆస్తికత్వము వుంటున్నది. ఏమిటిది. న అనగా కాదు. అస్తి అనగా గలు. గలు అనేది కాదని నాస్తికము. న + అస్తి - నాస్తి. అనగా నాస్తికుని యందు కూడను ఆస్తికత్వము వుంటున్నది. ఆస్తికత్వము చేరకపోతే నాస్తి అనే పదమే రాదు. కనుక నాస్తికుని యందు కూడను ఆస్తికము వుంటున్నది. ఏ విధంగా మనము అర్థం చేసుకోవాలి. నాస్తికత్వము కేవలము మొగ్గ వంటిది. ఇందులో సుగంధము మనకు కనుపించదు. కాని అది విచ్చిన తరువాతనే సుగంధము అనుభూతికి వస్తుంది. కనుక విచ్చిన పువ్వే ఆస్తికత్వము. విచ్చని మొగ్గనే నాస్తికత్వము. కాని రెండూ ఒక్కటే ఒకటి విచ్చినది ఒకటి విచ్చనిది. నాస్తికత్వమనగా వారిలో యింకా హృదయమనే కమలము వికసించలేదు. ఏనాటికైనా అది వికసిస్తుంది. వికసించకుండా ఒకో సమయంలో మొగ్గగానే రాలిపోతుంది. అది వారి దురదృష్టము. ప్రపంచమునందు రెండు పదార్థములు లేనే లేవు. కనుక ఏకం సత్ విప్రా బహుధా వదంతి. ఉన్నది ఒక్కటే. అది వ్యత్యస్తమైన, రసస్వరూపమైన బ్రహ్మను గుర్తించుకుంటే అన్నీ గుర్తించిన వాడవౌతావు. దానిని నీవు దర్శించుకుంటే అన్నీ దర్శించిన వాడవౌతావు. ఆ ఒక్కదాని యందే అన్నింటిని నీవు అర్పితము చేస్తున్నావు. దానికి ప్రత్యక్ష ప్రమాణము. ఒకడు ఏదో తన కార్యము సిద్ధింప చేసుకున్నప్పుడు భగవంతునికి సహస్ర నామార్చన చేస్తానని మొక్కుకున్నాడు. తన ఆరాధనా దేవతను కృష్ణుని పెట్టుకున్నాడు. సహస్ర నామాలు చేస్తున్నాడు. ఒక్కొక్క పుష్పము వేస్తున్నాడు. కేశవాయనమః, నారాయణాయనమః, మాధవాయనమః, గోవిందాయనమః అన్ని పేర్లు చెబుతున్నారు. ఒక్కొక్క పుష్పము వేస్తున్నాడు. పేర్లు వేరుగాని చేసే అర్పితము ఒక్క దేవునికే. వున్నది ఒక్కటే పేర్లు అనేకం చెప్పుకుంటున్నాం.

అన్నములవి వేరు ఆకలొకటె

పుష్పములవి వేరు పూజ ఒకటె
జన్మములవి వేరు జంతువొకటె.

కనుక మానవత్వములో యీ ఏకత్వమును మనము అభివృద్ధి గావిస్తూ రావాలి.

అంగీరసుడు శౌనకునకు చెప్పిన విషయాన్నే తిరిగి యీ సత్యకాముడు ప్రశ్నిస్తూ వస్తాడు పిప్పలాద మహర్షిని. స్వామీ! లోకములో మూడు విధములైన జ్ఞానములుంటున్నవి. ఒకటి సామాన్యమైన జ్ఞానము, రెండవది సుజ్ఞానము, మూడవది విజ్ఞానమని అనుకుంటున్నారు జ్ఞాన, సుజ్ఞాన, విజ్ఞానముల యొక్క సంబంధము ఏమిటి? వాటి అంతరార్థము ఏమిటి? వాటిని గురించి తమరు సెలవు యివ్వండి అన్నారు. 'కుమారా! జ్ఞానమునకు, సుజ్ఞానమునకు, విజ్ఞానమునకు ఎంతో భేదము లేదు. శారీరకంగా వచ్చేది జ్ఞానము మానసికంగా కలిగేది మరొక జ్ఞానము. హృదయము ద్వారా ఆవిర్భవించేది మరొక జ్ఞానము. దీనికి ఒక చిన్న ఉదాహరణము ఇది కర్చీఫ్, యిది మైక్, యిది టేబుల్, యిది టంబ్లరు, యిది ప్లేటు యివన్నీ చర్మచక్షువులకు కనుపించే లౌకికమైన జీవితములో మనము నిత్యానుభవములో అనుభవించిన పదార్థము యిది సహజ జ్ఞానము. ఇవి కేవలము దేహమునకు మాత్రమే సంబంధించినవి. దేహావినియోగమునకు సంబంధించినవి. కాని మానసికంగా మరొకటి వుంటున్నది. ఈ పని నేను చేస్తున్నాను. యీ పని వల్ల నాకును, నా చుట్టూ వుండిన జనములకు ఫలితము యేమైనా వుందా వుపయోగము వుందా అని పరోపకారమును దృష్టియందుంచుకొని తాను కర్మను ఆచరించటము సుజ్ఞానము. తన స్వార్థము నిమిత్తమే కాకుండా తన స్వార్థము కోసము చేసే కర్మలయందు దీనివల్ల యితరులకు యేమైనా ఫలితము వుంటున్నదా అనే భావములో చేసే కర్మలన్నీ సుజ్ఞానము. ఈ రెండింటిని పురస్కరించుకొని యేది చేస్తే దివ్యమైన తత్త్వము తృప్తి పడుతుంది? భగవంతుని తృప్తిపరచే మార్గము ఏమిటి? ఏ కర్మను ఆచరిస్తే భగవంతుడు నిత్య తృప్తుడౌతాడు? ఆ భగవంతుని తృప్తి పరచే పనులన్నీ విజ్ఞానములు. ఇవి ప్రత్యేకంగా వెతకనక్కరలేదు. పరమాత్మ తృప్తి పడినప్పుడు ప్రపంచమే తృప్తిపడుతుంది. అందుకోసమే ఒకానొక సమయములో ఒక భక్తుడు దేవుని ప్రార్థించుకుంటూ వచ్చాడు. నీవు నాకు దర్శనం యివ్వటంలేదు. ఎందుకు నన్ను నీవు కానకుండా పోయావు. నీ యొక్క దృష్టికి ఎందుకు నేను పడకుండా వున్నాను. నీ దృష్టి నాపై ఎందుకు పడకుండా వుంటున్నది. నీ దృష్టి నాకు లేనప్పుడు ఇంక జగత్తు నన్ను లెక్క చేస్తుందా?

నీకు కానివాడనైతే లోకమాత
నేను లోకమందు లోకువౌదు లోకమాత.

నీకే కాకపోతే నేను లోకానికే లోకువైపోతాను. ఓ తల్లీ! నీ దృష్టి నాపై పడకపోతే దైవదృష్టి నాపై పడదు.

429059112

దీనినే కృష్ణుడు ధృతరాష్ట్రుని భార్యయైన గాంధారికి సూటిగా హృదయానికి నాటుకునేలా చెప్పాడు. కౌరవులు నూరు మంది మరణించిన తరువాత శోకమును చల్లార్చాలని కృష్ణుడు వెళ్లాడు. సానుభూతి తెల్పటానికి వెళ్లాడు పాపం. కృష్ణుడు వస్తున్నాడనే వార్త వినేటప్పటికి గాంధారి పరమ రోషముతో కోపము చేతను, దుఃఖము చేతను కుమిలి పోతూ ద్వేషమును అభివృద్ధి పరచుకుంది. దుఃఖములో మంచి చెడ్డల వివేకము శూన్యమై పోతుంది. అందులోనే క్రోధము ప్రవేశిస్తుంది. క్రోధము చేత ద్వేషము వస్తుంది. ద్వేషక్రోధముల చేత అసూయ కూడను కలుగుతుంది. కన్నులు కట్టుకుంది అమ్మా కృష్ణుడు వచ్చాడని చెలికత్తెలు చెప్పారు. దుఃఖపడుతూ యీ గాంధారి చెబుతున్నది కృష్ణా! నీవు ఎంత బోధ బుద్ధి కలవాడవు. వంచకుడవు. పాండవులు కౌరవులు అన్నదమ్ముల బిడ్డలు. ఒకరిపైన దయ మరొకరిపైన యింత నిర్దయనా? వుండవచ్చు. ఐదుమంది పాండవుల లోపల ఐదు మంది మిగిలారు. నా కొడుకులలో ఒకరినైనా మిగల్చ కూడదా? పిండములు విడచటానికి ఒక్కరినైనా బ్రతికించ కూడదా? ఎందుకు నీ దివ్యదృష్టి ఒక్కని పైనా పడలేదు?" కృష్ణుడు ఎప్పుడు నవ్వులో సంసిద్ధుడు. ఒకరి దుఃఖము అతనికి ఆనందము.

కన్నీరు తప్పించు కన్నీరు తెప్పించు
భోగి జోగిగ చేయు జోగి భోగిగ జేయు

కన్నీరు తెప్పించటం దేనికి కన్నీరు తప్పించటం దేనికి? వారి వారి పాపములను పురస్కరించుకొని. ఈ సమయము లోపల గాంధారి అర్థము చేసుకోలేదని చక్కగా అనుభూతికైన విషయమును లోను అందించాడు. 'గాంధారీ! నీకు నూరుమంది కొడుకులున్నారని తెలుసు. కాని ఒక్క కుమారున్నైనా నీ కంటితో నీవు చూచావా? కేవలము అందరూ నీకు నూరుమంది కొడుకులున్నారంటే నీవు కూడను నూరు మంది కొడుకులున్నట్లుగా భ్రమిస్తున్నావు. ఒక్క కొడుకునైనా నీవు కంటితో చూడలేదు. కన్న తల్లి దృష్టికే నోచుకోలేని దుర్మార్గులు దైవదృష్టికి ఎట్లా నోచుకోగలరు?' చూశారా! కన్నతల్లి దృష్టికే నోచుకోలేని వ్యక్తులు దైవ దృష్టికి ఎట్లా నోచుకోగలరు? నీ దృష్టి లేనప్పుడు వారిపైన నిజమైన ప్రేమ ఎట్లా కలుగుతుంది? కనుక తల్లి దృష్టి నోచుకోలేని దుర్మార్గులు నీ కుమారులు. నిత్యమైన సత్యమైన స్వరూపాన్ని సత్పాత్రులైన వారిని ద్వేషిస్తూ వచ్చారు. పాండవులు ధర్మాత్ములు. అధర్మపరులైన నీ కుమారులు ఎంత చెప్పినను వినక వారిపైన ద్వేషము పూనుకున్నారు. వారికి యే మాత్రము విచారణా శక్తి శూన్యము. వారి నిందుకు స్వార్థమే. ఆ స్వార్థము చేతే వారు ఈ గతిని అందుకున్నారు. రాజ్యము న్యాయంగా చూస్తే పాండవులదే! పిల్లలు చిన్నవారగుట చేత నీ పతిని ఒక గార్డియన్ గా పెట్టుకున్నారు. కానీ నమ్మిన యీ చిన్న పిల్లలను

యింతమోసం చేయటం తగునా?. కాని చరిత్రయందు ఎవరికీ యీ రహస్యము తెలియదు. ఈవిధంగా కొన్ని సత్యాలు మనకు తెలియకపోవటంచేత మనం అనేక రకములైన అపోహలను గురియైపోతున్నాం. సత్యము తెలుస్తే అపోహలకు యేమాత్రం అవకాశము యివ్వం. భగవంతుని దృష్టి నోచుకున్నవాడు జగద్దృష్టిని కూడా నోచుకోగలడు. భగవత్ దృష్టికి దూరమైనవాడు ఎవరి దృష్టికి తాను అర్హుడు కాడు.

సమీపములో వుండిన వ్యక్తిని నాయనా నీవు చాలామంచివాడవు నాయనా అని సంబోధిస్తే అందరు అతనిని ప్రేమిస్తారు. అతనిని ఒక్కసారి దూరము పెట్టితే ప్రపంచము కూడను వానిని అసహ్యించుకుంటుంది. కనుక యేదానిని మనము గుర్తించుకుంటే సర్వము గుర్తించుకున్నవారమౌతామంటే ఒక్క దైవత్వాన్ని గుర్తించుకుంటే యీ విశ్వమంతయు దైవము సృష్టిలోని భాగమే. ఈనాటి ప్రపంచము ఆ సమత్వాన్ని గుర్తించటము లేదు. ఒకే కాయిన్ వుంటున్నది. ఈ కాయిన్ ఒకవైపునుంచే చూస్తున్నారు జనులు. రెండవవైపునకూడా చూచినప్పుడే ఆ కాయిన్ నిజమైన విలువ మనకు అర్థమవుతుంది. రెండవవైపున చూడటంలేదు. ఒకటి ప్రకృతి రెండవది పరతత్త్వము. ఒకటి క్షరము రెండవది అక్షరము. ఒకటి మూలము రెండవది స్థూలము. కాని యీనాడు స్థూలమునే చూస్తున్నారు. కేవలం ప్రకృతినే చూస్తున్నారు. భౌతికమునే చూస్తున్నారు. లౌకికమునే అనుభవిస్తున్నారు. ఈ నిత్య సత్యమైన మూలమును ఎవ్వరూ చూడటంలేదు. ఆమూలాన్ని చూచినప్పుడే మన చరిత్ర అంతయూ అర్థమవుతుంది. కనుక భగవంతుని చరిత్ర యిట్టిది అట్టిదియని ఎవరూ చెప్పలేరు. వ్రాసిన వ్రాతలను బట్టి చెప్పిన బోధలను బట్టి మనము అర్థం చేసుకొని యిష్టము విరోధము రెండింటిని మనము పెంచుకుంటున్నాము. ఈ రెండింటి పూర్ణత్వమును గుర్తించుకోటానికి ప్రయత్నం చేయాలి. కృష్ణుడు యిలాంటి వాడు అని గ్రంథములో వ్రాయటంవలన పెద్దలు చెప్పటం వల్ల అతను చాలా అసహ్యంగా భావిస్తారు కొందరు. రాముడు యిలాంటివాడు అని చెప్పటంచేత దానిని మనం విశ్వసిస్తాం. ఈ రెండింటిది కాదు. అందులో వున్న సత్యాన్ని మనం విశ్వసించాలి: గుర్తించాలి. ఈ రెండింటికి ఆధారము ఒక సత్యము వుంటున్నది.

గోపికలు కూడను ఒకనాడు చెప్పారు. కృష్ణా! కేవలము మాకన్నులు కనుపిస్తున్నాయి. మాకన్నులతో మిమ్మల్ని చూస్తున్నాము. ఈ కన్నులతో చూచినది ఎంతకాలము సత్యము. కన్నులున్నంతకాలము సత్యమవుతాయి. కనుక యీ సత్యము మాకు సత్యము కాదు. హృదయముతో చూస్తున్నాము. హృదయము మాలిన్యమైన కోనేరుగా వుంటున్నది. అందులో నీ యొక్క దానిని సరిగా చూడకుండా పోతున్నాం. మధ్యలోనున్న భాగము నలుపు. నీస్వరూపము కూడను నలుపే. హృదయము చూస్తామంటే మానస సరోవరమంతా మాలిన్యములో

చేరి నలుపుగా వుంటున్నాది. ఇందులో కనుపించే ఆకాశము reflection నల్లగానే వుంటుంది. కనుక మా హృదయములో నిన్ను చూడవలెనను కొంటే మా కన్నులు నీవు మార్చనక్కర లేదు. నీ స్వరూపమును అంతకంటే మార్చుకోనక్కర లేదు. మా dirty మనస్సును clean చేయమని కోరము కానికి background నల్లగా వుండే sky ని తెల్లనిదిగా మార్చు. అదే మా హృదయము. background గా వున్న హృదయాన్ని తెల్లగా మారిస్తే నల్లని స్వరూపము ఆ తెల్లని background లో చక్కగా కనుపిస్తుంది అన్నారు. కనుక హృదయాన్ని మార్చమన్నారు. దీని యొక్క అంతరార్థము ఏమిటి ప్రపంచములో మనము మారనక్కర లేదు. మన మనస్సును మార్చుకోనక్కరలేదు. మన ప్రజ్ఞాన సంబంధమైన హృదయాన్ని మార్చుకుంటే మనస్సు కేవలం మాలిన్యమైనదే. దాన్ని ఎంత కడిగినా మాలిన్యం పోదు. బొగ్గు నల్లగా వుందని పాలలో కడిగితే తెల్లగా అవుతుందా? పాలు కూడా నల్లగా అవుతాయి. బొగ్గును సబ్బులో కడుగుదామనుకుంటే సబ్బు కూడా నల్లగా అవుతుంది. చక్కగా think చెయ్యాలి విద్యార్థులు. ఈనాడు బొగ్గు కావటానికి పూర్వరూపము ఏమిటి? దీనికి పూర్వము కట్టె. ఈ కట్టె కాలటం చేత బొగ్గు అయింది. కాని యీ బొగ్గు కావటానికి కారణం ఏమిటి? ఈ అగ్ని పూర్ణముగా కాల్చలేదు దీన్ని. కాని యీ బొగ్గును తిరిగి అగ్నిలోనే వేసి పరిపూర్ణంగా కాల్చినప్పుడు అది white and light గా తయారై పోతుంది. బొగ్గును తెల్లగా చేయాలంటే పాలతో కడిగితే తెల్లగా రాదు తిరిగి అగ్నిలో వెయ్యాలి. ఈ బొగ్గును అగ్నిలో వేసి కాలిస్తే తెల్లని ధూళిగా తయారై పోతుంది. అనుగ్రహమనే అగ్నిలో దీన్ని వేసి నేను యిప్పుడు బొగ్గుగా వుంటున్నాను. కట్టెగానూ లేను, ధూళిగాను లేను. బొగ్గుగా తయారై పోయాను. ఆది, అంత్యము రెండూ మరచి మధ్యలో వుండటం చేత బొగ్గుగా రూపొందాను. ఆది వదలి పెట్టాను. కట్టెగా మారిపోయింది. కాని నేను అంత్యమునకు పోవాలి. అంత్యానికి చేరాలంటే అగ్ని సంస్కారం మరింత కావాలి. మనస్సు అనేది బొగ్గుగా మారిపోయింది. ఆదిని మార్చాము. అంత్యమును చేరుకోటానికి ప్రయత్నము చేయటం లేదు. మధ్యలో వుంటుండే కష్టములకు దుఃఖములకు గురై పోతున్నాము. ఈ జగత్తులో శాంతిని మనం పొందాలి. మానసిక శాంతిని పొందాలి. ఆత్మ శాంతిని పొందాలి అందుకోసమనే శాంతి శాంతి శాంతి యని మూడు శాంతులు నిత్యము ఉచ్చరిస్తున్నాము. మొట్టమొదట దేహశాంతిని చేయండి. దేహశాంతి కావాలనుకుంటే నామస్మరణ అవసరము. మానసిక శాంతి కావాలనుకుంటే బ్రహ్మభావము అత్యవసరము. హృదయ శాంతి కావాలంటే సాధన మనకు అత్యవసరము. దేహము నుండి మనసు, మనసు నుండి ఆత్మకు మనం ప్రయాణం చెయ్యాలి.